క్లుప్తంగా

రైతుబీమాకు దరఖాస్తు

వీపనగండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో 2022 ఆగస్టు నుంచి 2023 జూన్ 18 వరకు కొత్తగా పాస్‌పుస్తకాలు పొందిన రైతులు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఓ డాకేశ్వర్‌గౌడ్ కోరారు. 18ఏళ్ల నుంచి 59 ఏళ్లు ఉన్న వారికి మాత్రమే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకునే రైతులు పట్టాదారు పాసుపుస్తకంతో పాటు ఆధార్‌కార్డు, నామినీ ఆధార్‌కార్డుతో పాటు బ్యాంకు ఖాతా జిరాక్స్ కాపీలను తీసుకుని రావాలని ఆయన సూచించారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



అమరచింత: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించి తమ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కె.ప్రశాంత్‌రెడ్డి కోరారు. పట్టణంలోని శ్రీకృష్ణనగర్‌లో కబడ్డీ నేర్చుకుంటున్న చిన్నారులకు తన సొంత డబ్బులతో టీషర్టులను అందించారు. చిన్నారులను క్రీడల్లో ప్రోత్సహించాలన్న సంకల్పంతో తన వంతు సాయంగా టీషర్ట్‌ను అందించానని, త్వరలో క్రీడా వస్తువులను అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జుబేర్, విష్ణువర్ధన్‌యాదవ్, మన్నన్, వెంకటేశ్వర్‌రెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజినీర్స్ డే



వనపర్తి టౌన్: మధ్య తరగతి కుటుంబంలో జన్మించి గొప్ప ఇంజినీర్‌గా ఎదిగి, ఎంతో మందికి ఆదర్శంగా నిలిచిన నవాబ్ ఆలీ సేవలు మరువలేనివని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. మంగళవారం నవాబ్ ఆలీ నవాజ్ జంగ్ జయంతిని పురస్కరించుకొని టీజేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కవులు గిరిరాజాచారి, డాక్టర్ నరసింహాశర్మ, మండ్ల దేవన్న నాయుడు, ఈశ్వర్, బండలయ్య, పరమేశ్వరచారి, గంగాధర్‌చారి, మాధవచారి, సత్యంచారి ఉన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

ఖిల్లాఘనపురం: మండల కేంద్రానికి చెందిన ఆర్‌ఎంపీ నరేందర్‌గౌడ్‌ను వనపర్తి జిల్లా కాంగ్రెస్ డాక్టర్ సెల్ చైర్మన్‌గా నియమించారు. ఈ మేరకు మంగళవారం మాజీ మంత్రి చిన్నారెడ్డి చేతుల మీదుగా ఎంపిక పత్రాన్ని అందుకున్నట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా నరేందర్‌గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతలను పూర్తి స్థాయిలో నిర్వర్తిస్తానని చెప్పారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, నాయకులు దేవన్న యాదవ్, వాస నాగేశ్వర్, అజీమ్, శ్రీనివాసరెడ్డి, అతిక్ పాల్గొన్నారు.

'బీటీ'పై కేజీవీల్స్ ట్రాక్టర్ నడిపితే చర్యలు

పెబ్బేరు రూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో గల ట్రాక్టర్ యజమానులు పొలాలకు వెళ్లేందుకు కేజీవీల్స్ ట్రాక్టర్‌తో రోడ్డుపైకి వస్తే కఠిన చర్యలు ఉంటాయని శ్రీరంగాపూర్ ఎస్‌ఐ కేటీ మల్లేష్ హెచ్చరించారు. మండలంలోని వెంకటాపూర్, నాగసానిపలికి వెళ్లేందుకు నూతనంగా బీటీ రోడ్డు వేశారని, రైతులు ట్రాక్టర్లను కేజీవీల్స్‌తో రోడ్డుపై నడపడం ద్వారా రోడ్డు తొందరగా గుంతలుగా మారుతుందన్నారు. బీటీ రోడ్డుపై కేజీవీల్స్ ట్రాక్టర్ వెళ్లినట్టు సమాచారం వస్తే రూ.10వేలు జరిమానా విధించడంతో చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం

వీపనగండ్ల: సైబర్ మోసాలపై ప్రజలు పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండడం ఎంతో అవసరమని ఎస్‌ఐ రామన్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆన్‌లైన్ మోసాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు పూర్తి స్థాయి సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ వెంకటేష్, కానిస్టేబుల్ రవి, సురేష్ పాల్గొన్నారు.

కేజీబీవీల నిర్వహణలో ప్రభుత్వం విఫలం

అమరచింత: రాష్ట్రంలోని కేజీబీవీలు, గురుకులాల నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు వారణాసి కల్పన ఆరోపించారు. మండల కేంద్రంలోని కస్తూర్బాలో ఆహారం వికటించి 60 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటనపై మంగళవారం కేజీబీవీని సందర్శించి ఆస్పత్రి నుంచి పాఠశాలకు హాజరైన విద్యార్థినులతో మాట్లాడారు. విద్యార్థినుల ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అక్కడికి వచ్చిన జీసీడీఓ శుభలక్ష్మికి అందించారు. రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు బండి సంజయ్ పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థినులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేర్వరాజు, క్యామ భాస్కర్, సిద్ధురాములు, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అశ్వినిరాధ, సుమిత్రమ్మ, పుష్ప, వజయలక్ష్మి, జ్యోష్న తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో..



అప్పరాలలో..

అంగరంగ వైభవంగా బోనాలు

ఆత్మకూర్: పట్టణంతో పాటు మండలంలోని గ్రామాల్లో మంగళవారం పోచమ్మ బోనాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మున్సిపాలిటీ, పంచాయతీల ఆధ్వర్యంలో ఆలయల వద్ద ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. ఈ సందర్భంగా మహిళలు పోచమ్మ ఆలయాల వద్దకు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి పచ్చిపులుసు, అన్నం, కోళ్లు, పొటేళ్లతో నైవేద్యం సమర్పించారు. పట్టణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, కౌన్సిలర్లు చెన్నయ్య, అశ్విన్‌కుమార్, మహేశ్వరి, పోషన్న, యాదమ్మ, నాగలక్ష్మి, మండ్లరామకృష్ణ, తబుస్సూం బేగం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎమ్మెల్యే, జడ్జీ ప్రత్యేక పూజలు

పోచమ్మ బోనాల సందర్భంగా మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి శిరీష, ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఎంపీపీ బంగారు శ్రీను, మాజీఎంపీపీ శ్రీధర్‌గౌడ్, విండో అధ్యక్షుడు కృష్ణమూర్తి, వైస్‌ఎంపీపీ కోటేష్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవి యాదవ్, మాజీ ఎంపీటీసీ అనిల్‌గౌడ్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీఐ రత్నం, ఎస్‌ఐ నరేందర్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసారు.



ఆత్మకూర్‌లో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

అమరచింత: మండలంలోని నాగల్‌కడ్మూర్, పాంరెడ్డిపల్లి, కొంకన్‌వానిపల్లి, చంద్రగఢ్ గ్రామాల్లో మంగళవారం పోచమ్మ దేవత బోనాల పండుగను ఘనంగా జరుపుకొన్నారు. తమ పిల్లలతో పాటు పల్లెలను, పాడి పంటను చల్లగా చూడాలని వేడుకుంటూ అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు.

కొత్తకోట రూరల్: మండలంలోని అప్పరాలలో మంగళవారం పోచమ్మ బోనాల పండుగను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ హిమబిందు మహిళలతో కలిసి బోనమెత్తుకుని డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపుగా పోచమ్మ గుడి వద్దకు చేరుకొని నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

మదనాపురం: మండలంలోని అజ్జకొల్లు, గోపన్‌పేట, కొత్తపల్లిలో పోచమ్మ పండుగను గ్రామస్తులు కనులపండువగా జరుపుకొన్నారు. గ్రామస్తులు తమ ఇంటి ఇలవేల్పుగా కొలిచే పోచమ్మ తల్లికి కొత్త కుండలో నైవేద్యం వండి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



అజ్జకొల్లులో..



కొత్తపల్లిలో..



ఆత్మకూర్‌లో పూజలు చేస్తున్న న్యాయమూర్తి శిరీష



నాగల్‌కడ్మూర్‌లో బోనమెత్తిన మహిళలు



అజ్జకొల్లులో చిన్నారి

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పేదలకు వరం

పాన్‌గల్: మండలంలోని దావాత్‌ఖాన్‌పల్లికి చెందిన పెద్దమన్నెంనాయుడుకు మెరుగైన వైద్య నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ పథకం ద్వారా రూ.1.50 లక్షల ఎల్‌ఓసీని మంగళవారం కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయాన్ని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాముయాదవ్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకవెళ్లడంతో వెంటనే స్పందించి ఎల్‌ఓసీని మంజూరు చేయించినట్లు బాధిత కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

పెబ్బేరు: జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో పట్టణానికి చెందిన బాధితులకు మంగళవారం మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సీఎం సహాయ చెక్కులు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఇందిరమ్మకు రూ.45వేలు, వెంకటేష్‌కు రూ.42 వేలు, వైనమోని భగవంతుకు రూ.15వేలు, ఫర్జానా బేగం కు రూ. 9వేలు, చెలిమిల్లకు చెందిన ఇమామ్‌ఖాన్‌కు రూ.10వేల చెక్కులను బాధితులకు అందించారు. కార్యక్రమంలో గొని బుచ్చారెడ్డి, ఎండీ ముస్తాక్, ఎండీ మజీద్, రమేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని జగత్‌పల్లి, మనిగిల్ల, పెద్దమందడి, మోజర్ల, మద్దిగట్ల, అమ్మపల్లి గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంత్రి నిరంజన్‌రెడ్డి అందజేశారు.



సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

శ్రీరంగాపురం: శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములకు చెందిన గాడిమూడి చెన్నమ్మ రూ.9,500, సునీతకు రూ.17,500, కవితకు రూ.17 వేలు, శ్రీరంగాపురం గ్రామానికి చెందిన గొల్ల ఉమాదేవికి రూ.16,500, గుంటి మాధవికి రూ.15 వేలు, కుమ్మరి భానుకు రూ.17 వేలు, కుమ్మరి కురుమూర్తికి రూ.22,500 ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను మంత్రి నిరంజన్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామి, జిల్లా మీడియా సెల్ కన్వీనర్ దాడి యోగానందారెడ్డి, విష్ణుసాగర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి

పెబ్బేరు: పర్యావరణ పరిరక్షణ, అడవులను కాపాడాలనే లక్ష్యంతో పాదయాత్ర చేస్తున్న యవకుడు అషితోష పాండేకు మంగళవారం పట్టణ ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్య నగరానికి చెందిన అషిత్ పాండే అడవులు, కొండలు, ప్రకృతి కాపాడాలని అవగాహన కల్పిస్తూ 16 వేల కిలోమీటర్ల పాదయాత్రకు నడుంబిగించారు. ఈ మేరకు అయోధ్య నుంచి 2022 డిసెంబర్ 4వ తేదీన పాదయాత్ర ప్రారంభించాడు. వివిధ రాష్ట్రాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ 2026లో తిరిగి అదే అయోధ్య నగరంలో ముగింపు చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సుబ్బయ్యశెట్టి, ఎండీ ఖాజా, కౌన్సిలర్ చిన్నా ఎల్లారెడ్డి, మేకల యల్లయ్య, వెంకటస్వామి, శ్రీనివాస్‌గౌడ్, బాలరాజు, రాముడు తదితరులు పాల్గొన్నారు.



పాండేను సన్మానిస్తున్న ప్రజలు

నులి పురుగుల నివారణ ర్యాలీ

వీపనగండ్ల: సమాజం నుంచి నులిపురుగులను పూర్తిగా నివారించేందుకు వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు పూర్తి స్థాయిలో సహకరించాలని మండల వైద్యాధికారి వంశీకృష్ణ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలకు నులిపురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన అవగాహన కల్పించారు. ఏడాది వయస్సున్న చిన్నారుల నుంచి 19ఏళ్ల నిండిన వారిని గుర్తించి ఈ నెల 20వ తేదీన నులి పురుగు నివారణ మాత్రలను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గ్రామాల్లో ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడీ వర్కర్లు బాధ్యతతో పనిచేయాలన్నారు. అనంతరం గ్రామంలో నులిపురుగుల నివారణ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, వైద్యసిబ్బంది, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది

విద్యార్థులకు పోస్టర్ మేకింగ్ పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

వనపర్తి టౌన్: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి పోస్టర్ మేకింగ్ పోటీలను నిర్వహించారు. విద్యార్థులకు ఇంటర్నెట్ ఉపయోగం, పర్యావరణ పరిరక్షణకు సంబంధించి పోస్టర్ మేకింగ్ పోటీల్లో 36 మంది విద్యార్థులు పాల్గొన్నారని ఏఎంఓ మహానంది తెలిపారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి టీఎంఆర్‌ఆర్‌ఐఎస్ పాఠశాల విద్యార్థి శరత్, రెండో బహుమతి టీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్ పాఠశాల విద్యార్థిని వర్షిణి, మూడో బహుమతి బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి సాయివరణ్ గెలుచుకున్నట్లు సీఎంఓ యుగంధర్ వెల్లడించారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ శ్రీనివాసులు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తారాబాయి ఉన్నారు.

పాన్‌గల్: చిన్న కుటుంబంతో అనేక లాభాలు ఉంటాయని పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక జనాభా, పెద్ద కుటుంబం వల్ల జరిగే అనర్థాలు, చిన్న కుటుంబం వలన కలిగే లభాల గురించి వివరించారు.

రథయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

పెబ్బేరు: పట్టణ కేంద్రంలో ఎమ్మార్సీ భవనంలో టీఎస్ సీపీఎస్‌ఈయూ సంఘం ఆధ్వర్యంలో పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారి జయరాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయపరంగా రావాల్సిన పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి సీపీఎస్ బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ నెల 16 నుంచి పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్రను జోగులాంబ ఆలయం నుంచి ప్రారంభించి వనపర్తి జిల్లా మీదుగా కొనసాగుతుందన్నారు. ఈ యాత్రకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దయానంద్, ప్రధాన కార్యదర్శి చిన్నస్వామి, రవికుమార్, చిన్న రాములు, శివశంకర్, విష్ణువర్ధన్‌నాయుడు, శ్రీనివాస్‌గౌడ్, తిమప్ప, దామోదర్, శ్రీనివాసులు, మల్లికార్జున్, నరసింహ, షణ్ముఖి, నారాయణ, రమేష్, మురళి, సుధాకర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

పంచాయతీ కార్మికులపై చిన్నచూపు తగదు



పెద్దమందడిలో సమ్మెలో మాట్లాడుతున్న మాజీ మంత్రి చిన్నారెడ్డి

కొత్తకోట రూరల్: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ ఆరు రోజులుగా ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మిల డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి అన్నారు. మంగళవారం పెద్దమందడి మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెకు స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ ఏళ్లుగా పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు చాలిచాలనీ వేతనాలు ఇస్తూ వారి శ్రమను దోచుకుంటున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరిస్తామన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

మండలంలోని జగత్‌పల్లిలో బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి జిల్లా పార్టీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌తో కలిసి మాజీ మంత్రి చిన్నారెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలు విసుగెత్తిపోయారని, ఇందిరమ్మ రాజ్యం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. పార్టీలో చేరిన వారిలో ముంత తిరుపతయ్య, రమేష్, బాలయ్య, రాములు, యాదగిరి ఉన్నారు.

పాన్‌గల్: ప్రభుత్వం తక్షణమే స్పందించి పంచాయతీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్, పాన్‌గల్ ఎంపీటీసీ హైమావతి డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెకు మంగళవారం వారు మద్దతు ప్రకటించి మాట్లాడారు. కార్మికులను రెగ్యూలరైజ్, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, జీఓ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, 8 గంటలు పని దినాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో శివరాజ్, పెంటయ్య, రాజు, యాదగిరి, నాగన్న, అంజిరెడ్డి, రంగస్వామి, బాలకృష్ణ, సుగ్రీవుడు, బాలస్వామి, నాగమణి, బాలమ్మ పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంచేలా బోధన



శేరుపల్లిలో భోజనం పరిశీలిస్తున్న తహసీల్దార్ మురళి



పెబ్బేరులో..



వెంగళాయిపల్లిలో..

పాన్‌గల్: విద్యార్థుల సామర్థ్యాలు పెంచేలా బోధన సాగాలని మండల నోడల్ ఆఫీసర్ శంకరయ్య అన్నారు. మంగళవారం మండలంలోని వెంగళాయిపల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గణిత, ఇంగ్లిష్ పాఠ్యాంశాలపై సామర్థ్యాలను పరిశీలించి విద్యార్థులు ఇచ్చిన సమాధానంపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

శాగాపూర్ పాఠశాల సందర్శన

మండలంలోని శాగాపూర్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ, విద్యార్థుల హాజరు రిజిస్టర్లు, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. పుస్తక పఠనంపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఆర్పీలు గోవింద్, సంతోష్ హెచ్‌ఎం పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి

పెబ్బేరు రూరల్: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని తహసీల్దార్ మురళి ఆదేశించారు. ఆయన మంగళవారం శ్రీరంగాపురం మండలంలోని శేరుపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల సామర్థ్యాలు ప్రశ్నించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

నోటు పుస్తకాలు పంపిణీ

పెబ్బేరు: ఉమ్మడి పెబ్బేరు, శ్రీరంగాపూర్ మండలాల ప్రభుత్వ పాఠశాలలకు మంగళవారం నోటు పుస్తకాలు పంపిణీ చేసినట్లు ఎంఈఓ జయరాములు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న నోటు పుస్తకాలను రెండు మండలాల్లోని21 పాఠశాలల ఉపాధ్యాయులకు అందించామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వరప్రసాద్, వరలక్ష్మి, విజయకుమార్, ఇందిర పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీ పరిశీలన



గోపాల్‌పేట: మండలంలోని పొలికెపాడులో మంగళవారం రెండో విడత గొర్రెలను కాపర్లకు పంపిణీ చేస్తుండగా రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ రాంచందర్ పరిశీలించారు. పంపిణీలో ఎటువంటి అవినీతి, అక్రమాలకు తావులేకుండా చూడాలని ఆదేశించారు. పాడి రైతులు ఇబ్బందులు లేకుండా నిత్యం అందుబాటులో ఉండాలని మండల పశువైద్యాధికారి ఉదయ్‌కుమార్‌కు సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది బద్రీనాథ్, శ్రీనివాసులు, రైతులు శంకర్, గోవిందమ్మ, అనంతరాములు ఉన్నారు.

సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఖిల్లాఘనపురం: ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పంటల సాగు, యాజమాన్య పద్ధతుల్లో మార్పులు చేసుకోవాలని కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ రాజేందర్‌రెడ్డి, హెడ్ డాక్టర్ కోగారే అన్నారు. మంగళవారం మండలంలోని అప్పారెడ్డిపల్లి రైతువేదికలో సర్పంచ్ కృష్ణవేణి అధ్యక్షతన రైతులకు వివిధ పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారు రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల్లో ముఖ్యంగా పత్తి పంటలను కాపాడుకోవడానికి పైపాటిగా ఎరువులు వేయకుండా 19.19.19 లేదా 13.0.45 లేదా 20.20.20 ఎరువులను లీటర్ నీటిలో 5 గ్రాములు కలిపి పంటలపై పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఓ మల్లయ్య, ఎంపీటీసీ సభ్యుడు మల్లేష్, రైతు సమితి కో ఆర్డినేటర్ శంకర్‌గౌడ్, ఏఈఓలు బాల్‌రాజు, శంకరమ్మ, రైతులు పరమేశ్వర్‌గౌడ్, సురేష్, రామకృష్ణ, కొండయ్య, తిర్మలయ్య, నక్క తిర్మలయ్య తదితరులు పలువురు రైతులు పాల్గొన్నారు.



పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

అన్ని వర్గాల అభ్యున్నతే బీఆర్‌ఎస్ లక్ష్యం



అమరచింత: సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని అన్ని వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమిస్తూ సంక్షేమ పథకాలతో ఆదుకుంటున్నారని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న ముస్లిం శ్మశానవాటిక స్థలంలో సీడీసీ నిధుల ద్వారా మంజూరు చేసి నిర్మించిన దుకాణాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మిగిలిన దుకాణాల నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. అనంతరం మసీదులో కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈమేరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల అభ్యున్నతి కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ మహమ్మద్ ఖాజా, తహసీల్దార్ చాంద్‌పాషా, మార్కెట్ చైర్మన్ ఎస్‌ఏ రాజు, కోఆప్షన్ సభ్యులు సింధు, రాజ్‌కుమార్, షానవాజ్‌ఖాన్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యాదవుల సంక్షేమానికి ప్రాధాన్యత

పట్టణంలోని యాదవుల అభ్యున్నతి కోసం తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని అయ్యప్ప ఆలయ సమీపంలోని యాదవ కమ్యూనిటీ స్థలంలో నూతనంగా కమ్యూనిటీ హాలు నిర్మాణం కోసం భూమిపూజ నిర్వహించారు.